సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 13 । జూన్ । 2025



తరగతుల తొలగింపుపై ఆగ్రహం

చిన్న కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 6,7,8 తరగతులను ప్రభుత్వం తొలగించింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. -8లో



చదువులకు మార్గం..సార్వత్రిక విద్యా పీఠం

చదువుకోవాలన్న ఆసక్తి ఉండి కుటుంబ పరిస్థితులు అనుకూలించక నిత్యం, స్కూల్ లేక కళాశాలకు వెళ్లలేని వారికి ఓపెన్ స్కూల్ బాసటగా నిలుస్తోంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.227
రెండోరకం	రూ.120	రూ.170

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1652 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఫీజు పోరు వాయిదా

రాయచోటి: వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేపట్టే ఫీజుపోరు కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు కిషోర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. గుజరాత్‌లో సంభవించిన విమాన ప్రమాదం దృష్ట్యా ఫీజు పోరు కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం ప్రకటన మేరకు తర్వాత నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని విద్యార్థి విభాగాల నాయకులు, విద్యార్థి సంఘాలు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

17న జాబ్‌మేళా

రాయచోటి జగదాంబసెంటర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం రాయచోటిలోని శ్రీ షిరిడీ సాయి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 17న ఉద్యోగమేళా జరగనుంది. ఈ విషయాన్ని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి దాసరి నాగార్జున గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, హెట్రో ల్యాబ్స్, అపోలో ఫార్మసీ, ఎస్‌బీఐ కార్డ్స్, హీరో మోటో కార్ప్, ముత్తూట్ ఫైనాన్స్ తదితర కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9177143181, 9550104360, 889777636 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



బేబి హాసిని

మదనపల్లె సిటీ: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బేబి హాసిని ప్రథమ స్థానం దక్కించుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. గురువారం జిల్లా కేంద్రం రాయచోటిలో జరిగిన పోటీలో ప్రతిభ కనబరిచింది. హాసిని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వతరగతి చదువుతుంది. ఈనెల 20వతేదీ విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనన్నుట్లు పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, యోగా ట్రైనర్ నరేష్ బాబు తెలిపారు. హాసిని ఎంపీడీఓ తాజ్ మస్రూర్, పంచాయతీ కార్యదర్శి పవన్, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి



వ్యవసాయ అధికారి చంద్రానాయక్

కడప అగ్రికల్చర్: జిల్లాలో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ పేర్కొన్నారు. ఆయన గురువారం జిల్లా వ్యవసాయ అధికారిగా కడప కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

దేవదాయ అధికారులకు లోకాయుక్త నోటీసులు

ప్రొద్దుటూరు : దేవదాయ శాఖ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌తోపాటు ఈఓలకు ఈనెల 3వ తేదీన లోకాయుక్త నుంచి నోటీసులు జారీ అయ్యాయి. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ప్రొద్దుటూరులోని శ్రీకృష్ణ గీతాశ్రమంలో చోటు చేసుకున్న అవినీతిపై సమాధానం చెప్పాలని లోకాయుక్త కోరింది. గీతాశ్రమంలోని ఈఓ కార్యాలయంలో అటెండర్‌గా పని చేసిన బి.జనార్ధన్‌రెడ్డికి ఈఓ రామచంద్రాచార్యులు వేతన రూపంలో రూ.5 లక్షలు చెల్లించారు. గీతాశ్రమం నిర్వహణకు సంబంధించిన డబ్బును ఇందుకోసం వినియోగించారు. గతంలో ఇదే కార్యాలయంలో పని చేసిన జనార్ధన్‌రెడ్డి ప్రవర్తన సరిగా లేకపోవడంతో.. ఆశ్రమ నిర్వాహకుడిగా ఉన్న గంగాధరానంద గిరి స్వామి తొలగించారు. 2021 జూలై నుంచి జనార్ధన్‌రెడ్డి విధులకు హాజరు కాకపోగా.. రోజూ కార్యాలయ పరిసరాలకు వచ్చి గూగుల్ ద్వారా ఫొటోలు తీసుకుని కోర్టును ఆశ్రయించాడు. తాను రోజు విధులకు హాజరవుతున్నానని తెలిపాడు. కోర్టు నోటీసు మేరకు గతంలో పని చేసిన దేవదాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్.. జనార్ధన్‌రెడ్డి ప్రవర్తన సరిగా లేని మాట వాస్తవమేనని, గంగాధరానంద గిరి స్వామి ఇచ్చిన లేఖను సమర్పిస్తూ కోర్టుకు అఫిడవిట్ దాఖలు చేశారు. అప్పటి నుంచి జనార్ధన్‌రెడ్డికి, గీతాశ్రమానికి సంబంధాలు లేవు. కాగా ఇటీవల ఈఓ రామచంద్రాచార్యులు అతనికి లీజు బకాయిలు ఉన్నాయని చెప్పి రూ.5 లక్షలు చెల్లించడం జరిగింది. విధులకు రాని వ్యక్తికి రూ.5 లక్షలు దేవదాయ శాఖ సొమ్మును ఎలా చెల్లిస్తారని, దీనిపై విచారణ జరిపి ఆ డబ్బును తిరిగి ప్రభుత్వానికి జమ చేయాలని కోరుతూ పర్లపాడు గౌరీశంకర్ అనే వ్యక్తి లోకాయుక్తలో పిటీషన్ దాఖలు చేశారు. ఈ మేరకు దేవదాయశాఖ అధికారులకు లోకాయుక్త నోటీసులు అందాయి. ఏకంగా కమిషనర్ ఉత్తర్వులను కాదని ఈఓ రామచంద్రాచార్యులు అప్పనంగా జనార్ధన్‌రెడ్డికి డబ్బు చెల్లించడం చర్చనీయాంశంగా మారింది.

నరనారాన నయవంచన

- కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాదైనా పేదలకేదీ సంక్షేమం
- ఎన్నికలకు ముందు ఎన్నెన్నో హామీలు.. అమలులో వైఫల్యం
- విద్య, వైద్య రంగ సేవలు అంతంత మాత్రమే
- కొత్త పరిశ్రమల ఊసేలేదు.. ఉపాధికి దిక్కేది
- వైఎస్ జగన్ సర్కార్ హయాం స్వర్ణయుగం



సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికలకు ముందు ఎన్నెన్నో హామీలు..మరెన్నో ఆశలు రేకెత్తించి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ ఏడాదవుతున్నా అమలు చేయకుండా పేద ప్రజలకు నయవంచనకు గురి చేస్తున్నారు. అధికారంలోకి రావడమే పరమావధిగా అడ్డగోలుగా అమలు చేయగలమా? లేదా? అన్న ఆలోచన లేకుండా ఇష్టానుసారంగా హామీలు గుప్పించారు. ఒకటి కాదు రెండు కాదు అనేక రకాలుగా ఎక్కడ అవకాశముంటే అక్కడ మాటల గారడీతో ప్రజలను మాయ చేశారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించకుండా అణగారిన వర్గాలను ఆదుకోకుండా ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. ఒకవైపు బెదిరింపులు, మరోవైపు దౌర్జన్యాలు, ఇంకోవైపు భూకబ్జాలు ఇలా చెబుతూ పోతే అధికార పార్టీ ఆగడాలతోనే కాలం వెళ్లదీస్తోంది. ఎన్నికలకు ముందు టీడీపీ నేతలతోపాటు జనసేన, బీజేపీ నేతలు మూకుమ్మడిగా పేదలకు కావాల్సినవన్నీ అమలు చేస్తామంటూ ఊదరగొట్టారు. వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు, వేధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతూ పాలనను గాలికి వదలేస్తుండడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

వైఎస్సార్‌సీపీ హయాంలో పేదలకు భరోసా

2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అత్యుత్తమ ఫలితాలతో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ సర్కార్ పేదల సంక్షేమానికి పెద్దపీట వేసింది. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటింటికి సంక్షేమాన్ని అందించారు. ఎక్కడా కూడా కులం, మతం, వర్గం బేధం చూడకుండా అట్టడుగు వర్గాలకు సంక్షేమాన్ని అందించారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధితో రాష్ట్రంలోని అన్ని వర్గాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. ఐదేళ్ల కాలంలో కరోనా లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా కూడా పేదలకు గడువులోనే సంక్షేమాన్ని అందించారు. రైతులకు వైఎస్సార్ రైతు భరోసా, అమ్మ ఒడి, వైఎస్సార్ విద్యా దీవెన, వసతి దీవన, నిరుపేదలకు గృహాలు, విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, వైఎస్సార్ చేయూత, ఆపరేషన్ చేయించుకున్న వారికి ఆర్థికసాయం, ఆసరా, కాపు నేస్తం, నేతన్ననేస్తం, ఉచిత పంటల బీమా, రైతులకు ఉచిత బోర్లు, ఆటోవాలాలకు వాహనమిత్ర, ఇంటింటికి రేషన్ సరఫరా, వలంటీర్ల వ్యవస్థ ఇలా అనేక రకాలుగా ప్రజలకు పథకాలను అందించి ఆదుకుంది. మరోవైపు ఎక్కడా అభివృద్ధి కుంటుపడకుండా ముందుకు సాగడం వైఎస్ జగన్ సర్కార్ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

ఎదురుచూపులు



కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా హామీల అమలు కోసం ప్రజలకు ఎదురుచూపులు తప్పడం లేదు. సూపర్ సిక్స్‌తోపాటు ఇతర అనేక రకాల హామీలు ఇచ్చినా వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఒక్క ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, అన్నా క్యాంటీన్లు మాత్రమే అమలు చేయగా, ఉచిత గ్యాస్‌కు శ్రీకారం చుట్టినా అందులో వివిధ నిబంధనలతో అందని ద్రాక్షగా పథకం మారిపోయింది. ఈ మూడు మినహా మిగతా ఎలాంటి పథకాలను ప్రభుత్వం అమలు చేయలేదు. పేద ప్రజలతోపాటు గతంలో పథకాలు అందుకున్న లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఏడాది కాలంగా సంక్షేమం కోసం కళ్లుకాయలు కాచేలా చూస్తున్నా ఫలితం మాత్రం కనిపించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీహయాంలో అమలు చేసిన పథకాలకు సంబంధించి ఇప్పటిప్రభుత్వం పేర్లు మార్పు చేసిందే తప్ప పథకాల అమలుకు శ్రీకారం చుట్టకపోవడం ఆందోళన కలిగించే పరిణామం.

కనిపించని అభివృద్ధి

2024లో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినా పురోగతి జాడ కనిపించడం లేదు. జిల్లా కేంద్రంతోపాటు రాజంపేట, రైల్వేకోడూరు, తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాలుఉన్నాయి. జిల్లాలో ఉద్యాన పంటలకు ప్రసిద్ధి. అనేక పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయి. కానీ ఏడాది కాలంగా పరిశ్రమల జాడ లేదు. ఇంకోవైపు అభివృద్ధి పనులకు కూడా అడుగులు పడడం లేదు. కూటమి సర్కార్ కేవలం చిన్నపాటి రోడ్లు, గుంతలు పూడ్చడం మినహా మిగతావి జరగలేదు. వైఎస్సార్ సీపీ హయాంలో జిల్లా కేంద్రమైన రాయచోటి రూపురేఖలు మార్చారు. ఎక్కడ చూసినా ప్రగతి పరుగులు పెట్టింది. అన్ని గ్రామాల ముంగిటనే చూడగానే కనిపించే అందమైన సచిలయాలు, రైతు భరోసా కేంద్రాలు, బల్క్‌మిల్క్ కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీ, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతోపాటు అనేక విధాలుగా అభివృద్ధి కనిపించింది. ప్రస్తుత సర్కార్‌లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన అభివృద్ధి ముందుకు సాగడం లేదు. ఏదిఏమైనా కూటమి సర్కార్ హయాంలో అటు అభివృద్ధి, ఇటు సంక్షేమం పడకేసిందని విశ్లేషికులు సైతం వెల్లడిస్తున్నారు.

ఎదురు చూస్తున్నాం



నాకు ఇద్దరు కొడుకులు. వారు దేవపట్ల గవర్నమెంట్ బడిలో చదువుకుంటున్నారు. మాకు కూలి పనులు చేసుకోవడం తప్ప మరో ఆదాయం లేదు. తల్లికి వందనం కింద రూ. 15,000 చొప్పున ఇద్దరికి రూ. 30 వేలు వస్తాయని ఎదురు చూస్తున్నాం. అయినా ఒక్కొక్కరు ఒక విధంగా అనుకొంటుంటే డబ్బులు పడతాయో లేదో అనే ఆందోళన కలుగుతుంది. ఇచ్చిన మాట ప్రకారం ఎంత మంది పిల్లలు వుంటే అంత మందికి తల్లికి వందనం వేసి మాట నిలబెట్టుకోవాలి. – కాటమ్మ,దేవపట్ల, సంబేపల్లె/ ఒడలం

ప్రజలకు నష్టం కలగకుండా బ్లాస్టింగ్ నిర్వహించాలి

డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ అండ్ సేఫ్టీ కిషోర్ కుమార్



మంగంపేట ఏపీఎండీసీ గనులను పరిశీలిస్తున్న కిషోర్ కుమార్, రైతులు

ఓబులవారిపల్లె: రైతులు, ప్రజలను అప్రమత్తం చేసి వారికి ఎటువంటి నష్టం జరగకుండా మైన్‌లో బ్లాస్టింగ్ నిర్వహించాలని డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ అండ్ సేఫ్టీ కిషోర్ కుమార్ అన్నారు. మంగంపేట ఏపీఎండీసీ గనుల్లో నిర్వహిస్తున్న బ్లాస్టింగ్ వల్ల ఇబ్బందులు పడుతున్నామని రైతులు, గ్రామస్తుల ఫిర్యాదు చేయడంతో నెల్లూరు డీడీఎంఎస్ వారు గురువారం గనుల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మంగంపేట ఏపీఎండీసీ గనులు విస్తరించడం ద్వారా బ్లాస్టింగ్ సామర్థ్యాన్ని పెంచడంతో పెద్ద శబ్దాలతో భూమి కంపించడంతో పొలాల వద్ద పనిచేసుకోవాలంటే భయమేస్తుందన్నారు. అనంతరం కిషోర్ కుమార్ మాట్లాడుతూ మంగంపేట గనుల సమీపంలోని క్వారీలో నిర్వహిస్తున్న బ్లాస్టింగ్‌తో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు, రైతులు ఫిర్యాదు చేశారని, దీంతో వీటిని పరిశీలించడం జరిగిందన్నారు. జాతీయ రహదారి ప్రక్కనే ఉన్న క్వారీని కూడా పరిశీలిస్తామన్నారు. పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామని తెలిపారు. ఏపీఎండీసీ అధికారులతో మాట్లాడుతూ గనుల్లో నిర్వహిస్తున్న బ్లాస్టింగ్ సంబంధించి రైతులకు తెలియజేయాలని, దారిలో వెళ్తున్న వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఓ సుదర్శన్ రెడ్డి, మైన్స్ మేనేజర్ గోపినాథ్, మాజీ వైస్ ఎంపీపీ గునిపాటి చెన్నరాయుడు, రైతులు పోతల హనుమయ్య, ఎల్ చిన్న ఓబయ్య, ఎల్ దామోదరయ్య, మల్లికార్జున, కొటారి సుబ్రమణ్యం, పూతల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఏం ఒరగపెట్టారని ఉత్సవాలు: కొరముట్ల



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్: కూటమి ప్రభుత్వం ఏర్పడి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసి ఏడాది పాలనలో ఏం ఒరగపెట్టారని నియోజకవర్గంలోని నాయకులు సంబరాలు జరుపుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో ప్రధాన సమస్యలైన అండర్ బ్రిడ్జి, కోడూరు– చిట్వేలి రోడ్డు, సబ్ స్టేషన్లకు గత ప్రభుత్వంలోనే మంజూరైనందున నిధులు కేటాయించారనన్నారు. కేవలం వాటికి టెంకాయలు కొట్టుకుంటూ కాలం వెల్లబుచ్చి పథకాలు అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో కూటమి చేసిన అభివృద్ధి శూన్యం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ రమేష్ కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ రమేష్ కుమార్ రెడ్డి

రాయచోటి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన కాదని, ఇక్కడ వంచన ప్రభుత్వం నడుస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు ఆర్ రమేష్ కుమార్ రెడ్డి విమర్శించారు. గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటిలోని పార్టీ కార్యాలయంలో ఏడాది పాలనపై నిర్వహించిన మీడియా సమావేశంలో రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడారు. ఏడాది కాలంలో ఏదో సాధించామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏంటి అని ప్రశ్నించారు. ఒక ఏడాదిలోనే రూ. 1,50,000 కోట్ల అప్పులు చేసి ప్రజలపై భారం మోపారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వార్థంతో అమరావతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెబుతున్నారన్నారు. 50వేల కోట్ల టెండర్లు పిలవడం ఆయన లబ్ధికోసమేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో ఎలాంటి అభివృద్ధి చేసిన పాపాన పోలేదని విమర్శించారు. మహిళలపై ఇంత పెద్దఎత్తున ఆత్యాచారాలు, అఘాయిత్యాలు జరుగుతుంటే ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. అన్నమయ్య జిల్లాలో మైనర్ బాలికల మరణాలపై ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలి అక్రమ వసూళ్లకోసం పోటీ పడుతున్నారంటూ దుయ్యబట్టారు. హంద్రీనీవా, గాలేరు–నగిరి నిధులకు కోతవేసి కేవలం కుప్పంకు తప్ప మిగతా ప్రాంతాలను పక్కన పెట్టారన్నారు. అన్నమయ్య జిల్లాకు హంద్రీనీవా నీరు కూటమి పాలనలో దక్కే అవకాశాలు లేవన్నారు. పి–4 కథ దేవుడెరుగు ఈ రాష్ట్రంలో ఎ–4 అమలవుతుందన్నారు. ఎ–4 అంటే అవినీతి, అరాచకం, ఆశ్రితపక్షపాతం, అక్రమ వసూళ్లు..అత్యాచారాలని వివరించారు. పవన్ కల్యాణ్ ఉపముఖ్యమంత్రి అయిన తరువాత చంద్రబాబు భజన తప్ప ప్రజా సమస్యలపట్ల ఆయన గొంతు మూగబోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించే తత్వాన్ని కోల్పోయారని విమర్శించారు. మహిళల అక్రమ రవాణా జరుగుతోందని నాడు ఆరోపణలు చేసిన పవన్ కల్యాణ్ కఠిన చట్టాలు తీసుకొచ్చి తలలు తీస్తానన్నాడని, నేడు కనిపించకుండా పోయారని దుయ్యబట్టారు.'తల్లికి వందనం'లో చాలా మంది విద్యార్థుల అడ్మిషన్లు కావాల్సి ఉందన్నారు. 80 లక్షల మంది ఉంటే కేవలం 60 లక్షల మంది విద్యార్థులకు అంచనా వేశారన్నారు. సాక్షి మీడియా ప్రజల పక్షాన పోరాడుతుంటే కక్ష సాధింపుతో సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం అమానుషమన్నారు. ఏడాది పాలన సూపర్ సిక్స్ డైవర్షన్ కోసమే ఈ పన్నాగం పన్నారన్నారు. ఉర్సాలాంటి బినామీ కంపెనీలకు వేల ఎకరాల భూములు కట్టబెట్టడం చంద్రబాబు పాలనకు పరాకాష్ట అన్నారు. మహానాడులో తండ్రీ కొడుకులు పొగిడించుకోవడం కోసమే తప్ప రాష్ట్ర ప్రజల సంక్షేమంకోసం ఎటువంటి తీర్మానం చేయలేదన్నారు. ఏడాదిగా జగన్ మోహన్ రెడ్డిపై అసత్య ప్రచారాలకు ప్రాధాన్యత ఇచ్చారంటూ ఆరోపణలు గుప్పించారు.

నేడు వెలిగల్లు పార్కులో యోగా క్యాంపెయిన్

గాలివీడు: మండలపరిధి వెలిగల్లు ప్రాజెక్టు పార్కులో శుక్రవారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మెగా యోగా క్యాంపెయిన్ జరగనుంది. ఈ విషయాన్ని ఎంపీడీఓ జవహర్ బాబు గురువారం తెలిపారు. ఇందులో భాగంగా మండల స్పెషల్ ఆఫీసర్, డ్వామా పీడీ వెంకటరత్నం గురువారం పార్కు స్థలాన్ని పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు,వెలుగు సిబ్బంది, ప్రజలు, ప్రజా ప్రతినిధులు,ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాగభూషణం పాల్గొంటారు.



వెలిగల్లు పార్కును పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

నేరస్తులకు శిక్ష పడేలా చార్జ్ షీట్లు దాఖలు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి: పోలీసుశాఖ పట్ల ప్రజల్లో విశ్వసనీయత పెంపొందేలా విధులు నిర్వర్తించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి పేర్కొన్నారు. గురువారం రాయచోటి పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు రాజంపేట సబ్ డివిజన్ పోలీసు అధికారులకు నెలవారీ 'నేర సమీక్షా'సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. గ్రేవ్ (తీవ్రమైన) కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నేరస్తులకు శిక్ష పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలతో చార్జ్ షీట్లను నిర్ణీత గడువులోగా కోర్టులో దాఖలు చేయాలని స్పష్టం చేశారు. విదేశీయులు టూరిస్ట్ 'వీసా'పైన జిల్లాలోకి ప్రవేశించి 'వీసా' సమయం అయిపోయినా జిల్లాలో ఉండే వారిని గుర్తించాలని, వారిని వారి దేశాలకు పంపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి సమయాల్లో జరిగే నేరాలను అరికట్టడానికి బీట్ పోలీసులు, గస్తీ బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిగా నిరోధించడానికి నిఘా పెంచాలని సూచించారు.స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళలు, బాలికలు, బలహీన వర్గాలపై జరిగే నేరాల పట్ల మరింత సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని హితవు పలికారు. కార్యక్రమంలో, స్థానిక పోలీసు అధికారులు, రాజంపేట సబ్ డివిజన్ పరిధిలోని, సీఐలు, ఎస్ఐ లు పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్ అట్టర్‌ప్లాప్!

- పాఠాలు చెప్పేందుకు అధ్యాపకులు కరువు
- టీచర్లు లేకుండానే విద్యా సంవత్సరం ప్రారంభం



హైస్కూల్ ప్లస్ మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల

మదనపల్లె సిటీ: గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు, బలహీన వర్గాలకు ఉన్నత విద్యను అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఓ బృహత్తర లక్ష్యంతో ఉన్నత పాఠశాలలకు అనుబంధంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్‌ను ప్రారంభించింది.పదో తరగతి తర్వాత విద్యార్థులు చదువుకు దూరం కాకూడదన్న కారణంగా జిల్లాలో మదనపల్లె, చిట్వేలి, గాలివీడు, టి.సుండుపల్లి మండలాల్లో హైస్కూల్ ప్లస్ ప్రారంభించింది. అందులో ఉచితంగా ఇంటర్మీడియట్‌ను ప్రారంభించి, ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులను ప్రవేశపెట్టింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆయా హైస్కూల్ ప్లస్‌లను గాలికొదిలేసింది. నిర్వహణ పట్టించుకోలేదు. కనీసం అధ్యాపకులను కూడా నియమించలేదు. పాఠాలు చెప్పేవారే లేకుండానే నేడు హైస్కూల్ ప్లస్‌లు ప్రారంభంకానున్నాయి. హైస్కూల్ ప్లస్‌లో చేరడానికి విద్యార్థులు సిద్ధంగా ఉన్నా అధ్యాపకులు నియామకం జరగకపోవడంతో వారి తల్లిదండ్రులు ఆలోచనలో పడ్డారు. గత ఏడాది కూడా అధ్యాపకుల నియమించకపోవడంతో ఆయా పాఠశాల్లోని ఉపాధ్యాయులే విద్యాబోధన చేశారు. దీంతో ఫలితాలు కూడా అంతంత మాత్రమే వచ్చాయి. కొన్ని చోట్లయితే సున్నా శాతం ఫలితాలు వచ్చాయి. ఈ ఏడాదైనా పాఠశాలలు తెరిచిన వెంటనే అధ్యాపకులును నియమిస్తే ఫలితాలొస్తాయి. ఇదిలా ఉండగా హైస్కూల్ ప్లస్ పాఠశాల్లో చదివే విద్యార్థులకు జీవశాస్త్రం, భౌతిక,రసాయన శాస్త్రాలకు సంబంధించి తరగతి గదులు,ల్యాబ్‌లు, తదితర మౌళిక సదుపాయాలు కూడా కల్పించలేదు. అధ్యాపకులను కూడా నియమించలేదు. ఈ పాఠశాలల్లో విద్యార్థులు చేరడానికి సుముఖత వ్యక్తం చేయడం లేదు. ఈ విద్యా సంవత్సరమైన పాఠశాలలు పునః ప్రారంభం సందర్భంగా అధ్యాపకులను నియమించి ల్యాబ్, మౌళిక వసతులు ఏర్పాటు చేస్తే మంచి ఫలితాలు ఆశించవచ్చని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

అధ్యాపకులను నియమించాలి

హైస్కూల్ ప్లస్‌లలో విద్యార్థుల సౌకర్యం కోసం అధ్యాపకులను నియమించాలి. సకాలంలో యూనిఫాం,పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందజేయాలి. గత ప్రభుత్వం ఉన్నతాశయంతో ప్రారంభించిన హైస్కూల్ ప్లస్‌లను బలోపేతం చేయాలి. –మాధవ్,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

క్లుప్తంగా

కారు ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన ఆరీఫుల్లా

కేవీపల్లె : బైకును కారు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారి ఈతమానువడ్డిపల్లె సమీపంలో గురువారం జరిగింది. వివరాలిలా.. కలకడ మండలం బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లెకు చెందిన ఆరీఫుల్లా (40) గురువారం పీలేరు నుంచి ద్విచక్రవాహనంలో స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే మార్గ మధ్యంలోని ఈతమానువడ్డిపల్లె వద్ద కారు ఢీకొంది. దీంతో అతను రోడ్డుపై పడడంతో అదే సమయంలో వచ్చిన ఐచర్ లారీ అతనిపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆరీఫుల్లా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేవీపల్లె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక



పుర్విజా



యశస్విని



పర్షిత



గిప్సిత

నందలూరు : కడప జిల్లా క్రికెట్ జట్టుకు నందలూరు క్రికెట్ సబ్ సెంటర్ నుంచి నలుగురు బాలికలు ఎంపికయ్యారు. వీరిలో విభా ఎరుడైట్ స్కూల్‌కు చెందిన పుర్విజా, గిప్సిత, కేంద్రీయ విద్యాలయం రాజంపేటకు చెందిన పర్షిత, యశస్విని ఉన్నారు. వీరు స్థానిక సబ్ సెంటర్ కోచ్‌లు గయాజ్, ఫిరోజ్‌ఖాన్ లోడి, ఫిట్‌నెస్ ట్రైనర్ శివకోటి వద్ద శిక్షణ పొందారు. ఎంపికైన వారిని విభా ఎరుడైట్ స్కూల్ కరెస్పాండెంట్ జయభాస్కరరావు, కేంద్రీయ విద్యాలయానికి చెందిన పీఈటీ రాహుల్ అభినందించారు.

వృద్ధురాలి అదృశ్యం



నాగమ్మ (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : పట్టణానికి చెందిన నాగమ్మ అదృశ్యంపై కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాగమ్మ మే 27న స్థానిక రామేశ్వరం మునిస్వామి దేవస్థానం ఎదురు వీధిలో ఉన్న తన చిన్న కుమారుడు గంగాధర్ ఇంటి నుంచి మనస్తాపంతో వెళ్లిపోయిందని కుమారులు గంగాధర్, బాబులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

చదువులకు మార్గం.. సార్వత్రిక విద్యా పీఠం

- ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
- వయసుతో సంబంధం లేకుండా చదువుకునేందుకు అందరూ అర్హులే
- టెన్త్, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



ఓపెన్ స్కూల్ స్టడీసెంటర్ ఉన్న రాజంపేటలోని ప్రభుత్వ హైస్కూల్



సార్వత్రిక విద్యాపీఠం లోగో

రాజంపేట టౌన్ : చదువుకోవాలన్న ఆసక్తి ఉండి కుటుంబ పరిస్థితులు అనుకూలించక నిత్యం, స్కూల్ లేక కళాశాలకు వెళ్లలేని వారికి ఓపెన్ స్కూల్ బాసటగా నిలుస్తోంది. సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నామమాత్రపు ఫీజుతో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా (ఏపీ ఓపెన్ స్కూల్) రాష్ట్ర ప్రభుత్వం దూర విద్యను అందిస్తుంది. రెగ్యులర్ చదువుతో సమానమైన ఈ కోర్సుల్లో వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరు చదువుకునేందుకు అర్హులే. రెగ్యులర్‌గా చదివి టెన్త్, ఇంటర్ ఫెయిల్ అయిన వారు, చదువు మధ్యలో నిలిపేసిన వారు, తక్కువ విద్యార్హతతో ఏళ్ల తరబడి చిరుద్యోగం చేస్తున్న వారు, వ్యాపారులు, గృహిణులు, ప్రజా ప్రతినిధులు ఇలా ఎవరైనా ఓపెన్ స్కూల్‌లో చేరవచ్చు. గతంలో ఈ విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండేది. ప్రస్తుతం సమీపంలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో చదువుకోవచ్చు.

నోటిఫికేషన్ విడుదల..

2025–2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఆసక్తిగల వారు ఈ ఏడాది జూలై 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. టెన్త్‌లో ప్రవేశానికి 14 సంవత్సరాలు నిండి ఉండాలి. అలాగే ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి చదివి వుంటే రికార్డు షీటు, ఆరవ తరగతి నుంచి ఆపై చదివి వుంటే టీసీ, టెన్త్ ఫెయిల్ అయివుంటే టీసీతో పాటు ఫెయిల్ అయిన మార్కుల మెమో కలిగి వుండాలి. ఇక ఏమీ చదవకుండా ఉంటే సంబంధిత అధికారులు జారీ చేసే జనన ధృవీకరణ పత్రం కలిగివుంటే టెన్త్‌లో ప్రవేశానికి అర్హులవుతారు. టెన్త్‌లో ఐదు సబ్జెక్ట్‌లు ఉంటాయి. ఆప్షనల్ సబ్జెక్ట్‌గా హిందీని తీసుకోవచ్చు. ఇక టెన్త్ ఉత్తీర్ణులైన వారు ఇంటర్మీడియట్‌లో చేరేందుకు అర్హులు. ఇంటర్మీడియట్‌లో ఏ గ్రూపు తీసుకున్నా ఐదు సబ్జెక్టులు చదవాల్సి వుంటుంది.

రెగ్యులర్ సర్టిఫికెట్‌లతో సమానం..

ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్‌కు రెగ్యులర్ విద్యార్థుల సర్టిఫికెట్‌తో తత్సమానంగా ప్రాధాన్యత ఉంటుందో ఉండదో అని చాలా మందిలో అపోహ వుంది. అయితే అది అవాస్తవం. ఓపెన్ స్కూల్ సొసైటీ జారీ చేసే ఉత్తీర్ణత సర్టిఫికెట్లు సాధారణ పాఠశాల విద్య, కళాశాల విద్య సర్టిఫికెట్లతో సమానం. ఉన్నత చదువులు చదువుకునేందుకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

జిల్లాలో 41 స్టడీ సెంటర్లు..

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో టెన్త్, ఇంటర్మీడియట్‌కు సంబంధించి 41 కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో స్టడీ సెంటర్‌లో టెన్త్‌లో 100 సీట్ల చొప్పున ఉంటాయి. అలాగే ఇంటర్‌లో నాన్ సైన్స్ గ్రూపులకు సంబంధించి 40 సీట్లు, సైన్స్ గ్రూపులకు సంబంధించి 100 సీట్లు ఉంటాయి. అడ్మిషనస్ పొందిన వారికి ఓపెన్ స్కూల్ సొసైటీ ఉచితంగా పుస్తకాలు ఇస్తుంది. ప్రతి ఆదివారం, రెండవ శనివారం వంటి సెలవు రోజుల్లో తరగతులను నిర్వహిస్తారు. దాదాపు 30 కాంట్రాక్టు తరగతులను నిర్వహిస్తారు. ఇందులో 24 కాంట్రాక్టు తరగతులకు హాజరైన వారికి మాత్రమే పబ్లిక్ పరీక్ష రాసేందుకు అనుమతి ఉంటుంది. విద్యార్థులు వెంటనే ఉత్తీర్ణులు కాకుంటే ఐదు సంవత్సరాల్లో తొమ్మిది మార్లు పరీక్ష రాసి ఉత్తీర్ణులు కావచ్చు.

ఇంటర్‌లో సైన్స్, ఆర్ట్స్ గ్రూపులు..

ఇంటర్మీడియట్‌లో సైన్స్, ఆర్ట్స్ గ్రూపులు ఉంటాయి. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీ, ఎంబైపీసీ గ్రూపులు ఉంటాయి. ఇందులో విద్యార్థులు తమకు నచ్చిన గ్రూపులో చేరవచ్చు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ, ఒరియా మీడియంలు ఉన్నాయి. వీటిలో విద్యార్థులు తమకు నచ్చిన మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. ఇంటర్మీడియట్‌లో ఐదు సబ్జెక్టులు ఉంటాయి. టెన్త్ ఉత్తీర్ణులైన సంవత్సరంలోనే ఇంటర్ చేరితే ఇంటర్మీడియట్‌లో నాలుగు సబ్జెక్ట్‌లు మాత్రమే పరీక్ష రాసుకోవాల్సి వుంటుంది. ఆ తరువాత ఏడాది మరొక సబ్జెక్ట్ రాసుకోవాల్సి వుంటుంది. టెన్త్ ఉత్తీర్ణులైన తరువాత ఒక ఏడాది గ్యాప్ ఉంటే ఐదు సబ్జెక్ట్‌లు ఒకేసారి రాసుకోవచ్చు.

దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేదీ :30–7–2025 200 రూపాయల అపరాధ రుసుముతో 1–8–2025 నుంచి 15–8–2025 వరకు ప్రవేశం పొందవచ్చు.

కొత్త స్టడీ సెంటర్లకు దరఖాస్తు చేసుకోవచ్చు..



ఈ ఏడాది కొత్తగా ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లను ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి గల ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే వివిధ కారణాల రీత్యా రెగ్యులర్‌గా టెన్త్, ఇంటర్మీడియట్ చదవలేని వారికి ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్మీడియట్‌ను పూర్తి చేసుకోవడానికి ఇది చాలా చక్కటి అవకాశం. ఈ ఉత్తీర్ణత సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు వుంది. అందువల్ల ఉన్నత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఈ సర్టిఫికెట్లు ఉపయోగపడతాయి.

– కొండూరు శ్రీనివాసరాజు, ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్

విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న పాఠ్యపుస్తకాలు, విద్యాకానుక రాష్ట్ర డైరెక్టర్

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకంలో రుచికరమైన భోజనం అందించాలని పాఠ్య పుస్తకాలు, విద్యాకానుక రాష్ట్ర డైరెక్టర్ మధుసూదన్ రావు పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన స్వయంగా భోజనం తిని నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం పంపిణీ చేసినందున విద్యార్థులు ఎలా తింటున్నారని అడిగి తెలుసుకున్నారు. వంటల నిర్వాహకులు పరిశుభ్రంగా ఉండాలని, వంట పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుని ఉంచుకోవాలని సూచించారు. అనంతరం మండలానికి వచ్చిన పాఠ్య పుస్తకాలు, విద్యా సామాగ్రిని ఆయన పరిశీలించారు. పాఠ్య పుస్తకాలన్నింటిని పాఠశాలలకు సరఫరా చేశారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పుస్తకాలను, స్కూల్ బ్యాగ్‌లు, బూట్లను వీలైనంత త్వరగా విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శోభారాణి, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం గీత, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో 8 మందికి తీవ్ర గాయాలు



ఆటో బోల్తా పడిన ప్రమాదంలో గాయపడిన బాధితులు



టాటా ఏస్ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన అక్కాతమ్ముళ్లు

మదనపల్లె రూరల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 8 మంది తీవ్రంగా గాయపడి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన సాంబశివ(18), శివకుమార్ (14), శ్రీకాంత్(18), దుర్గ(20) మదనపల్లెకు చెందిన రెడ్డిశేఖర్(35) ఆటోలో కలిచెర్ల నుంచి గుర్రంకొండ టమాటా మార్కెట్‌కు వస్తుండగా, మార్గమధ్యంలోని సంగసముద్రం పంచాయతీ మామిళ్లవారిపల్లె సమీపంలో ఆటో బోల్తా పడి తీవ్రంగా గాయపడ్డారు. అదేవిధంగా తంబళ్లపల్లె మండలం గ్యారెడ్డిగారిపల్లెకు చెందిన ధనలక్ష్మి(24) అత్తగారిల్లు అయిన ఆర్‌సీ కురవపల్లెలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తోంది. గురువారం తమ్ముడు గోవర్ధన్(20)తో కలిసి స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో ఆర్.సీ.కురవపల్లెకు వస్తుండగా, మార్గమధ్యంలోని సీటీఎం పంచాయతీ నేతాజీకాలనీ వద్ద టాటా ఏస్ వాహనం ఢీకొంది. మదనపల్లె మండలం వలసపల్లె పంచాయతీ నవోదయ కాలనీకి చెందిన సమీవుల్లా(60) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సాయంత్రం మదనపల్లె నుంచి ఆటోలో ఇంటికి వెళుతుండగా మొలకలదిన్నె వద్ద కారు ఢీకొంది. ఆయా ఘటనల్లో బాధితులు తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు వారిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన అంకాలయ్య

జమ్మలమడుగు రూరల్ : మోరగుడి గ్రామానికి చెందిన చాకలి అంకాలయ్య (38) అనే వ్యక్తి గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణ ఎస్ఐ హైమావతి ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మోరగుడి గ్రామానికి చెందిన చాకలి అంకలయ్య గత కొంత కాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి మద్యం తాగా డు. గురువారం ఆరోగ్యం సరిగా లేదని సోదరుడి కుమారుడు యోగేశ్వర్‌కుతో మాత్ర లు తెప్పించుకున్నాడు. మాత్రలు వేసుకున్న తరువాత ఆయాసం ఎక్కువ కావడంతో వెంటనే తమ్ముడు సంజీవకు సమాచారం ఇచ్చారు. ఆటోలో జమ్మలమడుగులో ని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళుతుండగా ముక్కులో నుంచి రక్త స్రావమైంది. డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విమాన ప్రమాద ఘటన దిగ్భ్రాంతికరం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : అహ్మదాబాద్‌లో బోయింగ్ విమాన ప్రమాద దుర్ఘటన పట్ల గడికోట శ్రీకాంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం రాయచోటిలో పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. విమానం ఒక మెడికల్ కళాశాల మెస్‌పై కూలడంతో కొత్త తరానికి వైద్య సేవలు అందించాల్సిన 50 మందికి పైగా వైద్యులు మృతి చెందడం హృదయ విదారకమన్నారు. విమాన ప్రమాదంలో మృతి చెందిన 242 మంది ప్రయాణికులకు, సిబ్బందికి ఘటనలో మృత్యువాతపడ్డ డాక్టర్లకు ఆయన సంతాపం వ్యక్తం చేశారు. చనిపోయిన ప్రయాణికులు, విద్యార్థులు, సిబ్బంది కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇప్పటికైనా దేశ పౌర విమానయానశాఖ కట్టుదిట్టమైన నిర్వహణ చర్యలు తీసుకోవాలని కోరారు.

‘దేశం’లో ఎవరి దారి వారిది!

- కూటమి ప్రభుత్వ విజయోత్సవానికి ప్రధాన నాయకుల డుమ్మా
- ఎవరి కార్యాలయాల్లో వారు సంబరాలు
- కార్యకర్తల్లో అయోమయం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు టీడీపీలో వర్గ పోరు కొనసాగుతూనే ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి విజయోత్సవ వేడుకలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ కోడూరులో మాత్రం లైట్‌గా తీసుకొన్నారు. నియోజకవర్గంలోని అగ్రనాయకులు ఎవరికి వారు నిర్వహించుకున్నారు. రాఘవరాజపురంలోని ప్రస్తుత టీడీపీ ఇన్‌చార్జి ముక్కారూపానంద రెడ్డి పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన తనయుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి అంతా తానై టీడీపీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులు, మాజీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడు హాజరు కాలేదు. ఇంతమంది అగ్ర నాయకులు ఉన్నప్పటికీ ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో సహా ఎవరూ రాకుండా సంబరాలు జరిగిపోవడం కార్యకర్తల్లో చర్చకు దారి తీసింది. మాజీ ఎమ్మెల్సీ బత్యాల తన కార్యాలయంలో కార్యకర్తల నడుమ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. రెండు నెలల క్రితం రాఘవరాజపురంలోని రూపానందరెడ్డి కార్యాలయం వద్ద మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సమక్షంలో ఇరువర్గాల బాహాబాహీ తారాస్థాయికి చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుత ఇన్‌చార్జి ఒంటెద్దు పోకడలతో సీనియర్ కార్యకర్తలకు ప్రాధాన్యం లేకుండా పోయిందని పలువురు అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది.

ఆ గట్టునుంటావా.. ఈ గట్టునుంటావా..

రైల్వేకోడూరు నియోజకవర్గంలో అగ్రనాయకుల తీరు ఆ గట్టునుంటావా .. ఈ గట్టునుంటావా అన్న చందంగా ఉండడంతో తెలుగు తమ్ముళ్లలో గందరగోళం నెలకొంది. వర్గ పోరులో నాయకులు, కార్యకర్తలు నలిగి పోతున్నారు. ముఖ్యంగా పనులు, కాంట్రాక్టుల విషయం కార్యకర్తలు వెనకడుగు వేస్తున్నారు. ఎవరికి నచ్చకపోయినా పనులు ఆపేస్తే తమ పరిస్థితి ఏంటన్న పరిస్థితిలో ఉన్నారు.

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్ఐ రామాంజనేయులు, పోలీసులు

కలకడ : పట్టపగలు యువకుడిని కిడ్నాప్ చేసి చిత్రహింసలకు గురిచేసిన ఆరుగురు నిందితులను అరెస్టు చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. 10వతేదీన కలకడకు చెందిన తాసిక్‌అలి కలకడ హెచ్‌పీ పెట్రోల్ బంకు వెనుక భాగంలో యంఎస్ఆర్ వర్క్‌షాపులో ఉండగా రూ.10 లక్షలు అప్పు చెల్లించాలని రాయచోటికి చెందిన అబ్దుల్ ఘని కుమారుడు షేక్ ఖాజా రాయచోటి టౌన్ కొత్తపల్లెకు చెందిన మరో ఐదుగురితో కలిసి బొలెరో వాహనంలో కిడ్నాప్ చేశారు. రాయచోటికి తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేశారు. బాధితుడి తల్లి కౌసర్ ఫిర్యాదు మేరకు కిడ్నాప్‌కు పాల్పడిన ఖాజా, అతనికి సహకరించిన కరీముల్లా కుమారుడు సుహేల్, బాసు కుమారుడు షబ్బీర్, జమాలుల్లా కుమారుడు అసద్ అక్రం, మహ్మద్‌సాహెబ్ కుమారుడు మహమ్మద్ హుస్సేన్, కరీముల్లా కుమారుడు ఫాజిల్‌లను గురువారం గుర్రంకొండ వద్ద అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి బొలెరో వాహనం, బుల్లెట్ మోటార్‌సైకిల్, బజాజ్ పల్సర్ బైక్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడాది కూటమి పాలనలో ఏం సాధించారో చెప్పాలి

అట్లూరు : కేంద్రంలో, రాష్ట్రంలో ఏడాది కూటమి పాలనలో ఏం సాధించారో ప్రజలకు చెప్పాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య ప్రశ్నించారు. గురువారం బద్వేలు పట్టణంలోని సీపీఐ కార్యాలయం జీవీ భవన్‌లో నిర్వహించిన ఆ పార్టీ పట్టణ మహాసభలలో ఆయన మాట్లాడారు. డబుల్ ఇంజన్ సర్కార్ అనే గొప్పలు చెప్పుకుంటూ ఎన్నికల హామీలు అమలు చేయకుండా ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దగా చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం పూర్తికి నిధులు, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వంటి హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు.

గడ్డిమందు తాగి వ్యక్తి మృతి

కాశినాయన : మండలంలోని కొండ్రాజుపల్లె గ్రామానికి చెందిన కుమారి రమణయ్య (52) అనే వ్యక్తి గడ్డి మందు తాగి మృతి చెందాడు. ఎస్ఐ యోగేంద్ర వివరాలు వెల్లడించారు.

సెల్‌ఫోన్ల అపహరణ

పులివెందుల రూరల్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు అపహరణకు గురయ్యాయి. గురువారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని మారుతి హాలు రోడ్డు, అంబకపల్లె రోడ్డు, శ్రీరామా హాలు రోడ్డు, పాత బస్టాండు తదితర ప్రాంతాలలో దుండగులు నాలుగు సెల్‌ఫోన్లను అపహరించినట్లు బాధితులు తెలిపారన్నారు. అలాగే సాయంత్రం వేళలో ఆయా వీధులలో ఇళ్ల ముందు కూర్చొని ఉన్న మహిళల దగ్గర ఉన్న సెల్‌ఫోన్లను లాక్కెళ్లారని వారు వాపోయారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పలువురు సీడీపీఓల బదిలీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లోని పలువురు సీడీపీఓలను బదిలీ చేస్తూ స్త్రీ శిశుసంక్షేమశాఖ డైరెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలిలా ఉన్నాయి.

సీడీపీఓ పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం	బదిలీ అయిన ప్రాంతం
వైఎస్సార్ కడపజిల్లా		
ఎస్.ముంతాజ్‌బేగం	ముద్దనూరు	చాపాడు
కె.హైమావతి	ప్రొద్దుటూరు	ముద్దనూరు
ఎం.శ్రీలత	పులివెందుల	కమలాపురం
ఎస్.సునంద	కడప-1	రాజంపేట
జి.వాణిశ్రీ	ఏసీడీపీఓ	కడప-1
అన్నమయ్య జిల్లా		
వై.పద్మావతి	లక్కిరెడ్డిపల్లె	కంబదూరు (అనంతపురంజిల్లా)
ఎ.సుజాత	మదనపల్లె	తంబళ్లపల్లె
వై.నాగవేణి	తంబళ్లపల్లె	మదనపల్లె
టీపీ సాభాగ్యమ్మ	రైల్వేకోడూరు	పిచ్చాటూరు (తిరుపతి జిల్లా)
ఎం.సునీత	ఏసీడీపీఓ (సత్యసాయిజిల్లా)	మదనపల్లె
కె.ప్రమీల	పీడీ కార్యాలయం, రాయచోటి	పుత్తూరు (తిరుపతి జిల్లా)
వీరితోపాటు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్న 13 మందిని వివిధ ప్రాంతాలకు బదిలీ చేస్తూ కర్నూలు రీజనల్ జాయింట్ డైరెక్టర్ పి.రోహిణి ఉత్తర్వులు జారీ చేశారు.		
సూపర్‌వైజర్ పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం	బదిలీ అయిన ప్రాంతం
ఎస్.రేణుక	కడప-1	పులివెందుల
తులశమ్మ	లక్కిరెడ్డిపల్లె	టి.సుండుపల్లె
ఎం.శారద	రాయచోటి	లక్కిరెడ్డిపల్లె
పద్మజారాణి	లక్కిరెడ్డిపల్లె	రాయచోటి
ఎం.సుగుణ	రాయచోటి	కడప-1
సి.సరితాదేవి	పులివెందుల	కడప-1
ఎం.నాగరత్నమ్మ	కడప-1	రాజంపేట
ఎం.నిర్మల	రైల్వేకోడూరు	ముద్దనూరు
వి.రూపలక్ష్మి	రాయచోటి	లక్కిరెడ్డిపల్లె
టి.నాగేశ్వరి	పులివెందుల	కడప ఈఓ ఆఫీసు
కె.ఓబులమ్మ	కడప	ముద్దనూరు
కె.లలిత	రైల్వేకోడూరు	రాయచోటి ఈఓ ఆఫీసు
ఆర్.రాజేశ్వరి	చిట్వేలి	కర్నూలు ఈఓ ఆఫీసు

తరగతుల తొలగింపుపై తల్లిదండ్రుల ఆగ్రహం


పాఠశాలకు తాళాలు వేసి ఆందోళన



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఒంటిమిట్ట : మండలంలోని చిన్న కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 6,7,8 తరగతులను ప్రభుత్వం తొలగించింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం పాఠశాలకు తాళాలు వేసి ఆందోళన చేపట్టారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తమ పిల్లలను కూతవేటు దూరంలో చదువుకునే వెసులుబాటు కల్పిస్తే ఈ ప్రభుత్వంలో తమ పిల్లలను కిలోమీటర్ల మేర నడిపించే గతి పట్టిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణం చేసే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే దానికి ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా అంటూ వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పాఠశాలకు తాళాలు వేసిన విషయాన్ని తెలుసుకున్న డీఈఓ షంషుద్దీన్ వెంటనే డిప్యూటీ డీఈఓ రాజగోపాల్ రెడ్డి, ఒంటిమిట్ట మండల ఎంఈఓ వెంకటసుబ్బయ్య, ఎంఆర్‌ఓ దామోదర్ రెడ్డి, ఇన్‌చార్జి ఎస్ఐ రఫీతో కలిసి చిన్న కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు సర్దిచెప్పే ప్రయత్నం చేయగా వారు ససేమిరా అన్నారు. దీంతో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పి వారు వెనుదిరిగారు.


117 జీఓ ప్రకారమే తొలగించాం



ప్రత్యామ్నాయం 117 ప్రభుత్వ జీఓ మేరకు తరగతులను అప్ గ్రేడ్, డౌన్ గ్రేడ్ లిస్టు ప్రకారం తొలగించాం. ఇందులో మా సొంత నిర్ణయం ఏమీ లేదు. ఇది పూర్తిగా ప్రభుత్వం తీసుకొచ్చిన విధానం.

వెంకట సుబ్బయ్య, ఎంఈఓ, ఒంటిమిట్ట మండలం


ప్రమాదం జరిగితే ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా.?



గత కొన్నేళ్లుగా చిన్న కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 8వ తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇప్పుడు ఉన్నట్టుండి 6,7,8 తరగతుల విద్యార్థులను కిలోమీటర్ల దూరంలో ఉన్న హైస్కూల్‌కు వెళ్లమంటున్నారు. వెళ్లేటప్పుడు ఏదైనా జరిగితే ప్రభుత్వంబాధ్యత వహిస్తుందా..?

వెంకటమ్మ, చిన్నకొత్తపల్లి, ఒంటిమిట్ట మండలం

6,7,8 తరగతులను తొలగించండి..



1946 నుంచి చిన్నకొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో 7వ తరగతి వరకు ఉపాధ్యాయులు చదువు చెబుతూ ఉండేవారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ 8వ తరగతిని కూడా జత చేశారు. అయితే టీడీపీ ప్రభుత్వం వచ్చి సంవత్సరం అయిన తరువాత ప్రత్యామ్నాయం 117 జీఓను తీసుకువచ్చి ఇక్కడ తరగతులను తొలగించింది. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి.

రాణి, చిన్నకొత్తపల్లి, ఒంటిమిట్ట మండలం